సాక్షి
మహబూబ్‌నగర్
బుధవారం ၊ 19 ၊ మార్చి ၊ 2025



కడావర్ డాగ్స్‌తో అన్వేషణ

కార్మికుల ఆచూకీ కోసం కడావర్ డాగ్స్‌తో అన్వేషణ కొనసాగుతుంది.

వివరాలు 8లో ▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-34 (బుధవారం సాయంత్రం)

సహర్ 5-02 (గురువారం తెల్లవారుజామున)

వాతావరణం

గరిష్టం/కనిష్టం 40.3 /17.3

ఉదయం నుంచి ఎండ ఎక్కువగా ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. ఆకాశం నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేరాలను అరికట్టడమే పోలీస్‌శాఖ లక్ష్యం: ఎస్పీ



మహబూబ్‌నగర్ క్రైం: విజిబుల్ పోలీసింగ్ ద్వారా ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించడం, నేరాలను అరికట్టడం లక్ష్యంగా పోలీస్‌శాఖ పని చేస్తోందని ఎస్పీ డి.జానకి అన్నారు. వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న పలు ముఖ్య కూడళ్లు, ప్రార్థన మందిరాలను ఎస్పీ పరిశీలించారు. స్థానికంగా పోలీస్ సిబ్బంది ఎలాంటి విధులు నిర్వహిస్తున్నారు అనే అంశంపై తనిఖీ చేశారు. నేరాలను నివారించే చర్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యంగా కలగకుండా శాంతి భద్రతలను రక్షించాలన్నారు. తనిఖీల్లో డీఎస్పీ రమణారెడ్డి, వన్ టౌన్ సీఐ అప్పయ్య, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి వద్దకే రాములోరి కల్యాణం తలంబ్రాలు

స్టేషన్ మహబూబ్‌నగర్: భద్రాచలంలో వచ్చే నెల 6వ తేదీన జరిగే సీతారాముల కల్యాణ మహోత్సవం సందర్భంగా దేవాదాయశాఖ సహకారంతో టీజీఎస్‌ఆర్టీసీ లాజిస్టిక్ ద్వారా కల్యాణ తలంబ్రాలను ఇంటివద్దకే చేరవేస్తామని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సంతోష్‌కుమార్, లాజిస్టిక్ ఏటీఎం ఇసాక్‌బిన్ మహ్మద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు ఒక పాకెట్‌కు రూ.151 చెల్లించి బుకింగ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. మిగతా వివరాల కోసం ఆయా డిపోల మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లను సంప్రదించాలని కోరారు.

డీఈఐసీ కేంద్రం పరిశీలన

పాలమూరు: జిల్లా జనరల్ ఆస్పత్రిలో ఉన్న డీఈఐసీ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ పరిశీలించారు. డీఈఐసీ కేంద్రంలో మొత్తం ఎన్ని విభాగాలు ఉన్నాయి, పిల్లలకు ఎలాంటి వైద్య సేవలు అందిస్తున్నారు అనే అంశంపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అవసరమైన వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంపత్‌కుమార్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): కేంద్రంలోని బీజేపీ సర్కారు కార్మిక విధానాలను అవలంబిస్తోందని దానికి వ్యతిరేకంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందని భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబశివుడు అన్నారు. ఇప్పలపల్లిలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ భవన, ఇతర నిర్మాణ కార్మికులు ఉపాధి లేక గ్రామాల నుంచి పట్టణాలకు, నగరాలకు వలస పోతున్నారని, అక్కడ వారి జీవనం దుర్భరంగా మారుతుందన్నారు. పోరాడి సాధించుకున్న చట్టం కాగితాలకే పరిమితమవుతున్నాయని, మారుతున్న పాలకులు ప్రభుత్వాలు కార్మికుల పట్ల చిత్తశుద్ధిని ప్రదర్శించడం లేదని ఆరోపించారు. కార్మిక వ్యతిరేక విధానాలను రూపొందించే ప్రయత్నంలో ఉన్నారని వాటిని తిప్పి కొట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఈనెల 25న జిల్లాకేంద్రంలో నిర్వహిస్తున్న భవన, నిర్మాణ కార్మిక సంఘం సభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీయూసీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి సి.వెంకటేష్, నాయకులు గోవర్ధన్, ఉషన్న ఆంజనేయులు, శేఖర్, మల్లేష్, రవి, కే.నర్సింహులు, పి.చంద్రమౌళి చెన్నయ్య పాల్గొన్నారు.

బాలకార్మిక చట్టాలపై అవగాహన

పాలమూరు: జిల్లాకేంద్రంలోని షెల్టర్ హోం బాయ్స్ గృహాన్ని మంగళవారం జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి డి.ఇందిర సందర్శించారు. స్థానికంగా అందుతున్న వసతులు, సౌకర్యాలపై ఆరా తీశారు. ఆ తర్వాత న్యూ లైఫ్ చిల్డ్రన్ హోంను సందర్శించారు. స్థానికంగా ఉన్న పరిస్థితులపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాలల హక్కులు, బాల్య వివాహాలు, బాలకార్మిక చట్టాలపై అవగాహన కల్పించారు.

పరీక్షలు ప్రశాంతంగా రాయాలి

జిల్లాలో ఎస్సెస్సీ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి



- అవకతవకలు జరగకుండా పకడ్బందీ చర్యలు
- ఈసారి జీపీఏ విధానం కాకుండా మార్కులు ఇవ్వనున్న ప్రభుత్వం
- హాల్‌టికెట్లు ఆన్‌లైన్‌లో నేరుగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు
- ప్రతి పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం
- 'సాక్షి' ఇంటర్వ్యూలో డీఈఓ ప్రవీణ్‌కుమార్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఈ నెల 21 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని డీఈఓ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవకతవకలకు స్థానం లేకుండా పకడ్బందీగా చర్యలు తీసుకున్నామని, విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని సూచించారు. గత పరీక్షలతో పోలిస్తే ఈ పరీక్షల్లో కొన్ని మార్పులు జరిగాయని, వాటిని విద్యార్థులు గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు నేరుగా ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చని చెప్పారు. ఎస్సెస్సీ పరీక్షల నిర్వహణకు తీసుకుంటున్న చర్యలపై జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్‌కుమార్ 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఆ వివరాలు ఆయన మాటల్లో...

జిల్లావ్యాప్తంగా 60 పరీక్ష కేంద్రాల్లో ఏర్పాటు చేయనున్నాం. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష జరగనుంది. నిమిషం నిబంధన అమల్లో ఉంటుంది. విద్యార్థులు 30 నిమిషాలు ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి. పరీక్ష జరిగే సమయంలో పరీక్ష కేంద్రానికి దగ్గరలో ఉన్న జిరాక్సు సెంటర్‌లు సైతం మూసేయాలి. వీటితో పాటు ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో ప్రతి పరీక్ష కేంద్రాల్లో ఓ మెడికల్ టీం అందుబాటులో ఉంటుంది. ఓఆర్‌ఎస్ పాకెట్‌లు, మందులు, తాగునీరు అందుబాటులో ఉంచనున్నారు. పరీక్ష కేంద్రంలోనికి ఉపాధ్యాయులు, అధికారులెవరూ సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు, వాచ్‌లు తీసుకెళ్లడానికి అనుమతి లేదు.

పరీక్ష విధానంలో వచ్చిన మార్పులు..

గత పరీక్షలతో పోలిస్తే ఈ సంవత్సరం నిర్వహించే పరీక్షల్లో మార్కుల విధానంలో మార్పులు వచ్చాయి. జీపీఏ విధానం బదులు నేరుగా మార్కులు ఇవ్వనున్నారు. అంతేకాకుండా పరీక్ష సమయంలో జవాబు పత్రాలు విడిగా ఇవ్వడం కుదరదు. 24 పేజీలతో కూడిన బుక్‌లెట్‌కు క్యూఆర్ బార్‌కోడ్ ఉంటుంది. ఇది పూర్తిగా రాస్తేనే మరో బుక్‌లెట్ ఇస్తారు. వీటిలో పేజీలు మిగిలితే విద్యార్థి లేదా ఇన్విజిలేటర్ ఖాళీ పేజీలపై మార్క్ చేయాల్సి ఉంటుంది.

హాల్‌టికెట్ కోసం ఇబ్బందులు లేకుండా..

విద్యార్థులకు హాల్‌టికెట్‌లు ఇవ్వాలంటే తప్పకుండా ఫీజులు చెల్లించాలని పలు పాఠశాలల యాజమాన్యాలు ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులు నేరుగా ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దానిపై ప్రిన్సిపాల్ సంతకం కూడా అవసరం ఉండదు. హాల్‌టికెట్లు ఇవ్వలేదని ఆందోళన వద్దు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు హాల్‌టికెట్ చూపించి బస్సులో ఉచితంగా ప్రయాణం చేయవచ్చు. విద్యార్థులు ముందే కేంద్రానికి చేరుకుని ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలి.. విజయం సాధించాలి.

కాపీయింగ్‌కు అడ్డుకునేందుకు చర్యలు..

జిల్లాలో రెండు, మూడేళ్లుగా కాపీయింగ్ జరగడం లేదు. ఈసారి కూడా ఎలాంటి కాపీయింగ్ లేకుండా చర్యలు తీసుకుంటాం. జిల్లాలో ఆరు పరీక్ష కేంద్రాలను సమస్యాత్మకంగా భావిస్తున్నాం. వీటిపై స్క్వాడ్ ఇతర అధికారులతో ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుంది. 60 పరీక్షకేంద్రాల్లో 12,300 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. 60 డిపార్ట్‌మెంటల్ అధికారులు, 60 చీఫ్ సూపరిండెంటెంట్లు అందుబాటులో ఉంటారు. 650 మంది ఇన్విజిలేటర్‌లు విధులు నిర్వహిస్తారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలుతో పాటు పోలీసు బందోబస్తు కూడా ఉంటుంది. ఇప్పటికే మొత్తం ఆరు రూట్లలో ప్రశ్నపత్రాలు పంపిణీ చేశారు. వాటికి పోలీస్ బందోబస్తు మధ్య భద్రపరిచారు. ప్రతి పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, నిఘా ఏర్పాటు చేశాం. సీసీ కెమెరాల ముందే ప్రశ్నపత్రాలను తెరిచి, విద్యార్థులకు ఇవ్వాలి.

నిధులు వచ్చేనా.. పనులు సాగేనా?



పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులోని కృష్ణాతీరంలోని కోతిగుండు వద్ద ఇంటెక్

- ఉమ్మడి జిల్లాలో అసంపూర్తిగా ప్రాజెక్టుల నిర్మాణాలు
- గత ప్రభుత్వ హయాంలో నిధుల కొరతతో ముందుకు సాగని వైనం
- తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లాపై కరుణ చూపేనా
- పెండింగ్ పనులు పూర్తయితేనే పాలమూరు సస్యశ్యామలం
- నేడు రాష్ట్ర బడ్జెట్ నేపథ్యంలో జిల్లా రైతాంగం ఆశలు

గద్వాల: వలసలకు మారుపేరైన పాలమూరు వరుస మార్చాలనే తలంపుతో అప్పటి ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి జలయజ్ఞంలో భాగంగా ఉమ్మడి జిల్లాలో పెద్దఎత్తున సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టారు. ఐదేళ్ల పాలనలో దాదాపు పనులన్నీ 70– 80 శాతం వరకు పూర్తయ్యాయి. ఆ తర్వాత వరుసగా చోటుచేసుకున్న రాజశేఖరరెడ్డి మరణం, వరదలు, తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర ఆవిర్భావం వంటి పరిణామాలతో ఆయా ప్రాజెక్టు పనుల గమనానికి అడ్డంకిగా మారాయి. దీంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గడిచిన రెండు దశాబ్దాలుగా జలయజ్ఞం ప్రాజెక్టులు పెండింగ్‌లోనే కొనసాగుతున్న దుస్థితి. ఈ నేపథ్యంలో పాలమూరు వాసి అయిన సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఏర్పడిన ప్రభుత్వంపై పెద్దఎత్తున ఆశలు నెలకొన్నాయి. పెండింగ్ ప్రాజెక్టులకు నిధుల వరద పారి పంట పొలాలకు సాగునీరు అందుతుందనే అన్నదాతలు భావిస్తున్నారు. ఈ క్రమంలోనే రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న బడ్జెట్‌పై పెద్దఎత్తున ఆశలు పెట్టుకున్నారు. పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పనులు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నారు.

రెండు దశాబ్దాలుగా..

గద్వాల, అలంపూర్ నియోజకవర్గాల పరిధిలో 2 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు 2005లో చేపట్టిన నెట్టెంపాడు ప్రాజెక్టు పనులు ఇప్పటి వరకు 90 శాతం పూర్తయ్యాయి. మిగిలిన 10 శాతం పనులకు నిధుల లేమి ప్రధాన అడ్డంకిగా మారింది. ఈ పనులు పూర్తి చేయాలంటే రూ.231.36 కోట్లు అవసరం. వీటిని విడుదల చేస్తే రెండేళ్లలో పెండింగ్ పనులు పూర్తయ్యి నడిగడ్డలో కొత్తగా 58 వేల ఎకరాల ఆయకట్టు సాగులోకి రానుంది.

ర్యాలంపాడుకు మరమ్మతు..

నెట్టెంపాడు ప్రాజెక్టులో గుండెకాయగా చెప్పుకొనే ర్యాలంపాడు రిజర్వాయర్‌కు లీకేజీలు ఏర్పడ్డాయి. దీంతో 4 టీఎంసీల సామర్థ్యం గల జలాశయంలో ప్రస్తుతం 2 టీఎంసీలు మాత్రమే నిల్వ చేసుకునే పరిస్థితి. దీని మరమ్మతుకు సంబంధించి సర్వే ప్రక్రియ పూర్తి చేసి సుమారు రూ.137 కోట్ల అంచనాతో నివేదిక ప్రభుత్వానికి పంపారు. దీని మరమ్మతుకు అవసరమైన నిధుల కేటాయింపుపై రైతన్నలు ఆశలు పెట్టుకున్నారు.

- రెండేళ్ల కిందట రూ.581 కోట్లతో చేపట్టిన గట్టు ఎత్తిపోతల పథకం కింద కేటీదొడ్డి, గట్టు మండలాల్లో కొత్తగా 33వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందించే లక్ష్యంతో చేపట్టారు. ప్రస్తుతం ప్రాజెక్టు కింద 40 శాతం పనులు పూర్తికాగా మిగిలిన పనులు పురోగతిలో ఉన్నాయి. ప్రస్తుతం రూ.285.19 కోట్లు అవసరం ఉన్నట్లు అధికారులు నివేదిక పంపారు.
- ఆర్డీఎస్ ప్రాజెక్టులో భాగంగా తుంగభద్ర నది నుంచి నీటిని ఎత్తిపోసి 87,500 ఎకరాలకు అందించేలా రూ.1,197.77 కోట్లతో ఎనిమిదేళ్ల కింద తుమ్మిళ్ల లిఫ్టు చేపట్టారు. ఇందులో రూ.629.26 కోట్ల పనులు పూర్తి కాగా.. మిగిలిన పనులు పెండింగ్‌లో ఉన్నాయి.

సంగంబండ సైతం..


2003లో మక్తల్ మండలం చిన్నగోప్లాపూర్ దగ్గర కాల్వ పనులు ప్రారంభించారు. 2004లో జలయజ్ఞం భీమా ఫేజ్-1, ఫేజ్-2లకు జీఓ నం.166 విడుదల చేయగా రూ.1,426 కోట్ల నిధులు మంజూరు చేశారు. అయితే కాల్వల పనులు సక్రమంగా చేపట్టకపోవడంతో.. 2017లో మళ్లీ రూ.2,500 కోట్లు మంజూరు చేశారు. ఈ రెండు రిజర్వాయర్ల కింద పనులు దాదాపు 90 శాతం పూర్తి చేశారు. అయితే పొలాలకు సాగునీరందించేందుకు పిల్ల కాల్వలు పూర్తి కాకపోవడంతో మెయిన్ కెనాళ్ల ద్వారా చెరువులు నింపుతున్నారు.

కోయిల్‌సాగర్‌ది అదే దారి..

కోయిల్‌సాగర్ కుడి, ఎడమ కాల్వల మరమ్మతు, డిస్ట్రిబ్యూటరీ పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. ఇంకా సుమారు రూ.89.9 కోట్ల పనులు చేపట్టాల్సి ఉంది. కోయిల్‌సాగర్ ఎత్తిపోతల కింద నాగిరెడ్డిపల్లి పంప్‌హౌస్ వద్ద రూ.19.68 కోట్లు, తీలేరు పంప్‌హౌస్ వద్ద రూ.19.62 కోట్ల పనులు పెండింగ్‌లో ఉన్నాయి. కోయిల్‌సాగర్ బ్యాక్‌వాటర్ నుంచి తవ్విన దేవరకద్ర గ్రావిటీ కెనాల్ చౌదర్‌పల్లి నుంచి లక్ష్మీపల్లి వరకు రూ.21 కోట్ల విలువైన పనులు పెండింగ్ ఉన్నాయి. డిస్ట్రిబ్యూటరీ కాల్వల కింద, గ్రావిటీ కెనాల్ పరిధిలో, ఎడమ కాల్వ పొడిగింపు పనులకు గాను సేకరించిన భూములకు సంబంధించి ఇంకా 347 ఎకరాలకు పరిహారం చెల్లించాల్సి ఉంది.

'పాలమూరు' పరుగులు పెట్టేనా?

ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాలకు సాగునీరు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులు ఇంకా పూర్తికాలేదు. మొత్తం 12.50 లక్షల ఎకరాలకు నీరు అందించే లక్ష్యంతో చేపట్టిన ప్రాజెక్టు పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. 2015లో తొలుత రూ.35,200 కోట్ల అంచనాతో మొదలైన ప్రాజెక్టు గత ప్రభుత్వ హయాంలోనే అంచనా వ్యయం రూ.52,056 కోట్లకు పెరిగింది. ప్రాజెక్టు కింద పంపుహౌస్‌లు, రిజర్వాయర్లు, టన్నెళ్ల నిర్మాణం మాత్రమే పూర్తి కాగా.. కాల్వలు, డిస్ట్రిబ్యూటరీ చానళ్ల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. అన్నిచోట్ల కీలకమైన మోటార్ల బిగింపు ప్రక్రియ ప్రారంభించాల్సి ఉంది. ఇప్పటి వరకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా మొదటి లిఫ్టు వద్ద ఒక్క మోటారును మాత్రమే ప్రారంభించారు. నార్లాపూర్ సమీపంలో మొదటి లిఫ్టు వద్ద రెండు మోటార్లు, ఏదుల సమీపంలో రెండో లిఫ్టు వద్ద నాలుగు మోటార్లు, వట్టెం సమీపంలో మూడో లిఫ్టు వద్ద నాలుగు మోటార్ల చొప్పున బిగించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.



ర్యాలంపాడులోని ఎడమ వెంట్ వద్ద సగానికి పడిపోయిన నీటినిల్వ సామర్థ్యం

- కేఎల్‌ఐ కింద పూర్తిస్థాయి ఆయకట్టుకు నీరందించేందుకు కాల్వలు, డిస్ట్రిబ్యూటరీ కెనాళ్ల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఇందుకోసం ఏడాదికి రూ.200 కోట్ల వరకు నిధులు అవసరం కానున్నాయి.
- రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక కొడంగల్ – పేట ఎత్తిపోతల పథకానికి రూ.2,945 కోట్ల నిధులు మంజూరు చేశారు. పనులకు సంబంధించిన సర్వే మూడు దశల్లో పూర్తి కాగా.. ప్రాజెక్టు డీపీఆర్‌ను అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే నారాయణపేట, మక్తల్, కొడంగల్ నియోజకవర్గాల్లో లక్ష ఎకరాలకు సాగునీరు అందనుంది.

'గవర్నర్ల ద్వారా వీసీల నియామకం వద్దు'

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: గవర్నర్ల ద్వారా నేరుగా వీసీల నియామకం చేపట్టవద్దని పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పవన్‌కుమార్ అన్నారు. యూజీసీ నూతనసంస్కరణలకు వ్యతిరేకంగా ఈనెల 26న నిర్వహించే సదస్సుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను మంగళవారం పీయూలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కరణల పేరుతో యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తి, హక్కులను కాలరాయడానికి కేంద్ర ప్రభుత్వం యత్నిస్తోందన్నారు. రాష్ట్రంలో 90 శాతం విద్యార్థులు పేద వెనుకబడిన ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన వారే ప్రభుత్వ యూనివర్సిటీలలో విద్యనభ్యసిస్తున్నారని పేర్కొన్నారు. 11 ఏళ్ల ఎన్‌డీఏ పాలనలో ఇలాంటి విద్యార్థులకు ఫెల్లోషిప్ కోత పెట్టిందని ఆరోపించారు. సమావేశంలో వీసీ జీఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ ఆచార్య డా.చెన్నప్ప, నాయకులు వెంకటేష్, కావ్య, శంకర్, పావని, బాలు, రఘు పాల్గొన్నారు.

నేడు జాబ్‌మేళా

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో బుధవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి మైత్రిప్రియ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. తొమ్మిది ప్రైవేట్ కంపెనీల్లో 935 ఉద్యోగాల భర్తీ కోసం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం 99485 68830, 95502 05227, 91753 05435 నంబర్లకు ఫోన్ చేసి తెలుసుకోవాలని సూచించారు.

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి



ట్రైసైకిళ్లను పంపిణీ చేస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ రూరల్: శిశుగృహలో ఉన్న చిన్నారుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక దృష్టి పెట్టినట్లు కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. మంగళవారం హైదరాబాద్‌కు చెందిన ఫెర్నాండేజ్ ఫౌండేషన్ మెడికల్ టీమ్, జీజీహెచ్ డాక్టర్లు, ఆర్‌బీఎస్‌కే వైద్యులతో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శిశుగృహ చిన్నారులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. పిల్లలు ఇంటి వాతావరణంలో పెరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. శిశుగృహలోని ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు కావాల్సిన వైద్య సహాయం అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, డీడబ్ల్యూఓ జరీనాబేగం, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ సంపత్‌కుమార్ సింగ్, సీడీపీఓలు శైలాశ్రీ, రాధిక, ఏసీడీపీఓ వెంకటమ్మ, డీసీపీఓ నర్మద, శిశుగృహ మేనేజర్ గణేష్‌బాబు పాల్గొన్నారు.

భవిత సెంటర్లలో శిక్షణ

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు భవిత సెంటర్లలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు కలెక్టర్ విజయేందిర తెలిపారు. సమగ్ర శిక్ష సమావేశ మందిరంలో నిర్వహించిన దివ్యాంగ విద్యార్థుల ఉచిత సహాయ ఉపకరణాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిత సెంటర్లలో ఇస్తున్న ప్రత్యేక శిక్షణ దివ్యాంగ విద్యార్థుల తల్లిదండ్రులు ఉపయోగించుకొని వారికి జీవన నైపుణ్యాలు నేర్పించాలన్నారు. ఇక నుంచి వారానికి రెండుసార్లు భవిత సెంటర్లలో ఫిజియోథెరపీ సేవలు అందిస్తామన్నారు. దివ్యాంగ విద్యార్థులు ఏ విషయంలో కూడా తక్కువ కాదని వారికి ప్రత్యేకమైన నైపుణ్యాలు పుట్టుకతోనే వస్తాయని, వారిలో గల సృజనాత్మకతను నైపుణ్యాలను గుర్తించి వెలికి తీస్తే వారు చాలా ప్రతిభావంతులుగా మారుతారని తెలిపారు. గత ఆగస్టులో నిర్వహించిన అసెస్మెంట్ క్యాంపులో నుంచి 183 మంది విద్యార్థులను గుర్తించి వారికి అవసరమైన సుమారు రూ.16 లక్షలు విలువైన సహాయ ఉపకరణాలను కలెక్టర్ అందజేశారు. డీఈఓ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో కూడా భవిత సెంటర్లలో చదివే విద్యార్థులకు ప్రత్యేకమైన సౌకర్యాలు కల్పిస్తామని, వాటిని ఉపయోగించుకొని ఆయా పరీక్షల్లో సులభంగా ఉత్తీర్ణులు కావచ్చని తెలిపారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష సీఎంఓ బాలుయాదవ్, ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్ ఎంఈఓ లక్ష్మణ్ సింగ్ పాల్గొన్నారు

ట్రేడ్ లైసెన్స్‌పై దృష్టి సారించండి

- గడువులోగా మొత్తం ఫీజు వసూలు కావాలి
- మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ట్రేడ్ లైసెన్స్ ఫీజు మొత్తం వసూలు చేయాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మున్సిపల్ జవాన్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024–25 తో పాటు 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నగరంలోని వివిధ దుకాణాలు, వ్యాపార సంస్థల నుంచి రావాల్సిన రూ.3.13 కోట్లు రాబట్టాలన్నారు. ఇందులో ఇప్పటివరకు కేవలం రూ.97 లక్షలే వసూలైతే ఎలా అని ప్రశ్నించారు. ఈ నెలాఖరులోగా మిగిలిన ఫీజు సైతం వసూలు చేయాలని సూచించారు.

మెయిన్ పైపులైన్ పరిశీలన

కాగా, రెండు రోజుల క్రితం జడ్చర్ల-రాయచూర్ ప్రధాన రహదారిపై మోడ్రన్ రైతుబజార్‌కు ఎదురుగా ఉన్న మలుపు వద్ద మిషన్ భగీరథ పథకం మెయిన్ పైపులైన్‌కు లీకేజీ ఏర్పడి తాగునీరు వృథా అవుతోంది. విషయం తెలుసుకున్న ఇంజినీరింగ్ అధికారులు ఎట్టకేలకు మంగళ వారం అక్కడికి వెళ్లి మరమ్మతు చేశారు. ఈ పనులను మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి పరిశీలించి సిబ్బందికి తగు సూచనలిచ్చారు.

సమాజం కోసం పాటుపడాలి

- పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్
- యువ ఉత్సవ్-25 ప్రారంభం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: దేశం కోసం, సమాజం కోసం యువత పాటుపడాలని పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్ సూచించారు. పీయూలో మంగళవారం నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యువ ఉత్సవ్-25ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే అభివృద్ధి చెందిన దేశంగా భారత్ ఎదగడానికి యువత కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. ముఖ్యంగా గ్రామాభివృద్ధి వారితోనే సాధ్యమన్నారు. కాగా, వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. అనంతరం వివిధ అంశాలలో ప్రతిభ చూపిన వారికి నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో పీయూ రిజిస్ట్రార్ ఆచార్య డా.చెన్నప్ప, జిల్లా యువజన అధికారి వి.కోటానాయక్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన



ప్రతిభ చూపిన విద్యార్థులతో వీసీ శ్రీనివాస్, రిజిస్ట్రార్ చెన్నప్ప తదితరులు

క్లుప్తంగా

ఇంటికి నిప్పంటుకొని మహిళ సజీవ దహనం



లక్ష్మమ్మ (ఫైల్)

బిజినేపల్లి: ఇంటికి నిప్పంటుకొని ఓ మహిళ సజీవ దహనమైన ఘటన మంగళవారం మధ్యాహ్నం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన బత్తుల లక్ష్మమ్మ (48) ఇంట్లో ఉండగానే నిప్పంటుకుని భారీగా పొగలు వస్తుండటంతో చుట్టుపక్కల వారు గుర్తించి వెంటనే కుటుంబ సభ్యులు, అగ్నిమాపక కేంద్రానికి సమాచారమిచ్చారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకొని మంటలు అదుపు చేశారు. ఇంటి ప్రధాన ద్వారం వద్ద లక్ష్మమ్మ కాలిన శరీరంతో చనిపోయి కనిపించింది. కుటుంబసభ్యులు కూడా వెంటనే ఇంటికి చేరుకున్నారు. ఇంట్లోని ఒక గదిలో ఫర్నీచర్, ఇతర సామగ్రి కాలిపోయి ఉన్నాయి. మహిళ మృతిపై స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌చార్జ్ ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు.

చెరువులో పడి వృద్ధురాలు మృతి



బిచ్చమ్మ(ఫైల్)

లింగాల: మండలంలోని శాయిన్‌పేట సమీపంలో ఉన్న నర్సింహస్వామి చెరువులో పడి కుమ్మరి మధునాగుల బిచ్చమ్మ(65) అనే వృద్ధురాలు మృతిచెందింది. స్థానికులు తెలిపిన వివరాలు..వృద్ధురాలు బట్టలు ఉతుక్కోవడానికి చెరువు దగ్గరకు వెళ్లింది. ఇదే క్రమంలో కాలుజారి చెరువులో పడి ఉండొచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చెరువులో తెలియాడుతున్న మృతదేహాన్ని గమనించిన గ్రామస్తులు గుర్తించారు. మృతురాలి భర్త లక్ష్మయ్య ఇదివరకే మృతిచెందగా ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. ఈ సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ..

కోస్గి రూరల్: పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్‌ఐ బాల్‌రాజ్ తెలిపారు. గుండుమాల్ మండలంలోని భక్తిమళ్ల గ్రామానికి చెందిన పిట్టల రవితో బొంరాస్‌పేట మండలంలోని గౌరారం గ్రామానికి చెందిన మంగమ్మతో 14 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి కూతురు, కూమారుడు ఉన్నారు. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. సోమవారం మరోమారు గొడవపడి మనస్తాపానికి గురైన పిట్టల మంగమ్మ (32) వ్యవసాయ పొలానికి వెళ్లి పురుగుమందు తాగి ఇంటికొచ్చింది. వాంతులు కావడంతో కుటుంబసభ్యులు కోస్గి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో పాలమూరు నుంచి హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ కోలుకోలేక మంగళవారం మధ్యాహ్నం మృతిచెందింది. మృతురాలి చెల్లెలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

తండ్రి మందలించాడని..

నాగర్‌కర్నూల్ క్రైం: చికిత్స పొందుతూ ఓ బాలిక మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జనరల్ ఆస్పత్రిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ గోవర్ధన్ కథనం ప్రకారం.. నాగర్‌కర్నూల్ మండల పరిధిలోని గగ్గలపల్లి గ్రామానికి చెందిన ఓ మైనర్ బాలిక ఫోన్ చూస్తుండగా తండ్రి మందలించడంతో ఈనెల 15న ఇంట్లో పురుగు మందు సేవించింది. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించగా.. అక్కడే చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పోక్సో కేసులో జీవిత ఖైదు

మహబూబ్‌నగర్ క్రైం: పోక్సో కేసులో నిందితుడికి జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. 2020 డిసెంబర్ 21 కోయిలకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో దుప్పుల ఆనంద్ 14 ఏళ్ల బాలికను అత్యాచారం చేసి గర్భవతిని చేశాడు. ఈ ఘటనలో బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి కోయిలకొండ ఎస్‌ఐ సురేష్‌గౌడ్ క్రైం నంబర్ 138లో ఐపీసీ 376(3) సెక్షన్5(ఐ) పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. అప్పటి రూరల్ సీఐ కేసు పర్యవేక్షించి చార్జ్‌షీట్‌ను దాఖలు చేయగా మంగళవారం కేసు కోర్టుకు రావడంతో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలస్వామి 11 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి వాదనలు వినిపించారు. నేరం రుజువు కావడంతో జిల్లా పోక్సో కోర్టు న్యాయమూర్తి టి.రాజేశ్వరి నిందితుడు ఆనంద్‌కు జీవితఖైదుతో పాటు రూ.50 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. బాధిత కుటుంబానికి రూ.5లక్షల పరిహారం మంజూరు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ డి.జానకి నిందితుడికి శిక్ష పడే విధంగా కృషి చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్‌తో పాటు పోలీస్ సిబ్బందిని అభినందించారు.

మెలకువలు పాటిస్తే సత్ఫలితాలు



- నిత్యసాధనతోనే గణితం సులువే
- సైన్స్‌లో పట్టికలు.. ప్రయోగాలే కీలకం
- సోషల్‌లో అవగాహన.. విశ్లేషణే ముఖ్యం
- లాంగ్వేజీలో అక్షరదోషాల నివారణే కీలకం
- వ్యాకరణం, పదజాలమే ఆయుధాలు

నారాయణపేట రూరల్: పరీక్ష రాసేటప్పుడు విద్యార్థులు మెలకువలు పాటిస్తే సత్ఫలితాలు పొందొచ్చని పలువురు విద్యావేత్తలు పేర్కొంటున్నారు. 'పది' పరీక్ష విధానంలో విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకున్నది. గతేడాది నుంచి రెండు పరీక్షల స్థానంలో ఒకేరోజు పరీక్ష రాయాల్సి ఉంది. గణితం, సోషల్ సబ్జెక్టులకు 80 మార్కుల ప్రశ్నాపత్రంలో 20మార్కులు పార్ట్ బీకి కేటాయించారు. సైన్స్‌కు సంబంధించి ఫిజిక్స్, బయాలజీ రెండు పేపర్లు వేర్వేరుగా నిర్వహిస్తారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్ వంటి లాంగ్వేజ్‌లో చేతిరాతపై దృష్టిపెడితే మంచి మార్కులు సాధించే అవకాశముంది. ప్రతిసబ్జెక్టులో 100కు గాను 20మార్కులు ఇంటర్నల్ కాగా మిగిలిన 80 మార్కులకు మూడు గంటల వ్యవధిలో పరీక్ష నిర్వహించనున్నారు. హిందీ తప్ప అన్ని సబ్జెక్టులకు గతంలో 40 మార్కులు చొప్పున రెండు ప్రశ్నపత్రాలు ఉండేవి.పేపర్ల కుదింపు విద్యార్థులకు ఇబ్బంది కలిగినా పూర్తిస్థాయి అవగాహనతో ఉత్తమ ఫలితాలు సాధ్యమని నిపుణులు చెబుతున్నారు.

తెలుగు సులభమే..



చాలామందికి మాతృభాషగా ఉన్న తెలుగు సులభంగానే ఉంటుంది. పరీక్షల్లో అందమైన చేతి రాత ప్రదర్శిస్తే అధిక మార్కులు సాధించొచ్చు. గుండ్రంగా, అక్షర దోషాలు లేకుండా రాయాలి. శీర్షికలు, ఉప శీర్షికల కింద అండర్‌లైన్ చేస్తే ఆకర్షణీయంగా ఉంటుంది.

మంచి మార్కుల సాధన..



శతక మధురిమ పాఠ్యాంశంలోని పద్యాలు తాత్పర్యాలు చదువుకుంటే తప్పకుండా ఒక పద్యం వచ్చే అవకాశముంది. ప్రశ్నలు అడిగే తీరును అర్థం చేసుకొని మూలమైన ముఖ్యాంశాలను జవాబులుగా మలుచుకొని రాయాలి.

– స్వామి, తెలుగు టీచర్, మోమినాపూర్

హిందీ చదివేద్దాం..

హిందీలో 100% మార్కులు సాధించడం కష్టం అయినప్పటికీ పక్కా ప్రణాళికతో చదివితే ఆశించిన లక్ష్యం నెరవేరుతుంది. సులువుగా మార్కుల సాధనకు చేతిరాత, ఈ తరం మెలుకువలు పాటిస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చు.

వ్యాకరణంపై దృష్టి పెట్టాలి



హిందీలో వ్యాకరణంపై దృష్టి పెట్టాలి. అరగంట సమయంలో నాలుగు ఐచికాలతో కూడిన 20 ప్రశ్నలు ఉంటాయి. సంజ్ఞ, సర్వనామం, క్రియా, విశేషణం, ఉపసర్గ, ప్రత్యాయం, విలోమ పదాలు, విభక్తి, అంకెలు హిందీ అక్షరాల్లో మార్చడం, పురస్కారాలపై ప్రశ్నించే అవకాశం ఉంది.

– కాంబ్లె సత్యనారాయణ, హిందీ టీచర్, జెడ్పీహెచ్‌ఎస్, చిన్నపోర్ల

పట్టు సాధిస్తే ప్రశ్నను..



గణితంలో ప్రతి అధ్యాయంలో ఇచ్చిన భావాలపై పట్టు సాధిస్తే ప్రశ్నను ఏ విధంగా అడిగినా సమాధానం రాసే వీలుంటుంది. వాస్తవ సంఖ్యలు, సమితులు, బహుపదులు, త్రికోణమితి అధ్యాయాలపై పట్టు సాధించాలి. ముందుగా సులువైన వాటిని స్పష్టంగా జవాబులు రాయాలి. తర్వాత కఠినమైన వాటిని సాధించేందుకు ప్రయత్నించాలి. రేఖా చిత్రాలు పెన్సిల్‌తో గీయాలి. సాధనలు డబ్బాలో రాయాలి.


కఠినమైన అంశాలపై పట్టు సాధిస్తే..



గణితంలో కఠినమైన అంశాలపై పట్టు సాధిస్తే విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించొచ్చు. పాత ప్రశ్నపత్రాలు, నమూనా లెక్కలను ఎక్కువగా సాధన చేయాలి. అభ్యాస దీపికలు, ప్రీ ఫైనల్‌లో అడిగిన ప్రశ్నలను పరిశీలించాలి.

– సగర్ విశ్వనాథ్, మ్యాథ్స్ టీచర్, జెడ్పీహెచ్‌ఎస్, కానుకుర్తి

అవగాహనే అస్త్రం..



భౌతికశాస్త్రంలోని అంశాలు అభ్యాసన చేయడం చాలా సులభం. ప్రశ్నాపత్రంపై అవగాహన కలిగి ఉంటే మార్కులను సులువుగా సాధించొచ్చు. భౌతికశాస్త్రంలో ఒక పాఠ్యాంశంతో మరొకటి సంబంధం కలిగి ఉన్న విషయాన్ని గ్రహించాలి. రసాయన సమీకరణలు, ఆమ్లాలు క్షారాలు, కర్బన సమ్మేళనాలు పాఠ్యాంశాల నుంచి ఆయా పదార్థాల రసాయన ఫార్ములాలు గుర్తించుకుంటే సమీకరణలు రాయాలి. పరమాణు నిర్మాణంలో క్వాంటం సంఖ్యలు, నియమాలు, ఆర్బిటాల్ల ఆకృతులు, ఎలక్ట్రాన్ విన్యాసం అంశాలపై దృష్టి సారించాలి. ఓంనియమం, కిర్చాఫ్ నియమాలను నేర్చుకోవాలి.


క్షుణ్ణంగా చదువుకొని..



పాఠ్యాంశాలను క్షుణ్ణంగా చదువుకొని పటాలను ప్రాక్టీస్‌చేసి వాటి భాగాలు గుర్తించేలా నేర్చుకోవాలి. రేఖా కిరణ చిత్రాలు గీసేటప్పుడు స్కేల్ వాడాలి. ప్రయోగ విధానంలోని అంశాల ఆధారంగా ప్రశ్నలకు సమాధానాలు రాయాలి.

– భాను ప్రకాష్, ఫిజిక్స్ టీచర్, జెడ్పీహెచ్‌ఎస్ జాజాపూర్

బయాలజీ ప్రయోగాలపై దృష్టి



పర్యావరణం, సాంకేతికత ఆధారంగా అంశాలను దృష్టిలో ఉంచుకొని జీవశాస్త్రం(బయాలజీ) ప్రశ్నలు రూపొందిస్తారు. ముఖ్యంగా పట్టికలను నేర్చుకొని ప్రయోగాలపై పట్టు సాధిస్తే మంచి మార్కులు సాధించే అవకాశముంది. ప్రతి పాఠంలోని అంశాలు, నిర్దిష్ట శీర్షిక కింద ఇచ్చిన భావనలను, బొమ్మలు, చార్టులు, కృత్యాలను నేర్చుకోవాలి. సెక్షన్ 3 లో తప్పకుండా ప్రయోగం వస్తుంది.

అభ్యాస దీపిక ఉపయోగకరం..



ఎన్‌సీఈఆర్టీ రూపొందించిన అభ్యాస దీపిక విషయ సామగ్రి విద్యార్థులకు ఎంతో ఉపయోగకరం. ప్రతి భావనను రెండుసార్లు క్షుణ్ణంగా చదువుకొని అర్థం చేసుకోవాలి. అవసరమైన చోట పట్టికలు, బొమ్మలు గీసి భాగాలను తప్పకుండా రాయాలి. జత పరచడం, తప్పు వాక్యాన్ని గుర్తించడం, వరుస క్రమంలో అమర్చడం, ఫ్లో చార్టులు బొమ్మలు వంటి అంశాలపై ప్రశ్నలుంటాయి.

– ఎండీ గౌస్, బయాలజీ టీచర్, జెడ్పీహెచ్‌ఎస్, గుమ్మడ్క

ఆంగ్లం.. కష్టపడదాం..



ఇంగ్లిష్ అనగానే ప్రతి విద్యార్థికి కొంత భయం ఉంటుంది. ఏకాగ్రతతో చదివి పదాలు అర్థం చేసుకొని తప్పులు లేకుండా రాయగలిగితే మంచి మార్కులు సాధ్యం. ముందుగా ప్రశ్నలు చదివి అర్థం చేసుకోవాలి.

కొంత సాధన చేయాలి



వ్యాకరణం, పదజాలం, ఉపన్యాస రచన వాటిపై కొంత సాధన చేయాల్సి ఉంటుంది. పార్ట్ బీలో ఒక అపరిచిత పద్యం, గద్యం ఇచ్చి ఐచ్ఛికాల ప్రశ్నలు అడిగే అవకాశం ఉంటుంది. అబ్జెక్టివ్ టైప్‌లో ఐదు ఖాళీలు ఇచ్చి పూరించమంటారు.

– యాద్గిర్ నారాయణరెడ్డి, ఇంగ్లిష్ టీచర్, జెడ్పీహెచ్‌ఎస్, కొల్లంపల్లి

ప్రతి విషయాన్ని అవగాహన చేసుకుంటూ

సాంఘిక శాస్త్రం(సోషల్)లో విద్యార్థులు ప్రతీ విషయాన్ని అవగాహన చేసుకుంటూ చదవాలి. కీలక పదాలు రాసి పెట్టుకొని వాటిని గుర్తుంచుకొని ప్రశ్నలకు అనుగుణంగా సమాధానాలు రాయాలి. తప్పులు లేకుండా చక్కగా రాస్తే మంచి మార్కులు సాధించొచ్చు. పుస్తకంలోని అన్ని పాఠ్యాంశాలపై అవగాహన పెంచుకొని భావనల వారీగా ప్రాధాన్యం, అక్షరాలు, భేదాలు, పోలికలు, ఉదాహరణలు తెలుసుకోవాలి. పాఠాలు, గ్రాఫ్స్, పట్టికలు, పటాల వంటి అంశాల్లో సాధన చేయాలి. అభ్యాస దీపిక చదివితే మార్కులు పెరిగే అవకాశముంది.

అన్ని జాగ్రత్తగా గుర్తుంచుకోవాలి



పేరాగ్రాఫ్ విశ్లేషణ చేస్తున్నప్పుడు పేరాలోని అంశాన్ని మరింత వివరిస్తూ తన అభిప్రాయం వ్యక్తపరచాలి. పట్టిక, గ్రాఫ్ విశ్లేషణ సమయంలో ఉన్నది ఉన్నట్లుగా కాకుండా లోతుగా వివరించాలి. ప్రముఖుల లక్షణాలు, ఆశయాలు, నినాదాలు గుర్తించుకోవాలి. భారతదేశం, తెలంగాణ అవుట్ లైన్ మ్యాప్ గీయగలగాలి. ప్రపంచ పటంలో దేశాలు, సముద్రాలు, పర్వతాలు, నదులు, పట్టణాలు, ఎడారులు వంటి వాటిని జాగ్రత్తగా గుర్తుంచుకోవాలి.

– కే.కనకప్ప, సోషల్ టీచర్, జెడ్పీహెచ్‌ఎస్, దామరగిద్ద

కడావర్ డాగ్స్‌తో అన్వేషణ

- 25 రోజులైనా దొరకని కార్మికుల ఆచూకీ
- ఎస్‌ఎల్‌బీసీలో కొనసాగుతున్న సహాయక చర్యలు
- అందుబాటులోకి రాని రోబో సేవలు



సొరంగంలో తొలగించిన టీబీఎం శకలాలు

సాక్షి నాగర్‌కర్నూలు / అచ్చంపేట: శ్రీశైలం ఎడమ గట్టు కాల్వ (ఎస్‌ఎల్‌బీసీ) సొరంగంలో చిక్కుకున్న కార్మికుల ఆచూకీ కోసం సహాయక బృందాల అన్వేషణ కొనసాగుతూనే ఉంది. గల్లంతైన కార్మికుల జాడ కోసం మూడురోజులుగా కడావర్స్ డాగ్స్‌తో గాలింపు చేపడుతున్నా.. భారీగా ఉబికి వస్తున్న నీటి ఊట ఆటంకంగా మారుతున్నట్లు అధికారులు వివరించారు. డాగ్స్ చూపిన ప్రదేశాల్లో తవ్వకాలు చేపట్టినా మంగళవారం వరకు ఎలాంటి ఆనవాళ్లు లభించలేదు. ప్రమాదంలో 8 మంది కార్మికులు చిక్కుకోగా.. ఇప్పటి వరకు ఒక కార్మికుడి మృతదేహాన్ని గుర్తించి బయటకు తీసుకురాగలిగారు. మిగిలిన వారి ఆచూకీ కోసం డి–1, డి–2 ప్రదేశాల్లో తవ్వకాలు కొనసాగుతున్నాయి. 13.5 కి.మీ. నుంచి సొరంగం చివరి పాయింట్ వరకు 40 మీటర్ల దూరం అత్యంత ప్రమాదకరంగా ఉండటంతో సహాయక చర్యలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రోబోలతో సహాయక చర్యలు ఇంకా ప్రారంభం కాలేదు. వాటి ఇన్‌స్టాలేషన్ ప్రక్రియతో పాటు సిగ్నలింగ్‌ను మెరుగుపర్చేందుకు టెక్నీషియన్లు ప్రయత్నాలు చేస్తున్నారు. జియోలజికల్ సర్వే ఆఫ్ ఇండియా(జీఎస్‌ఐ) అధికారులు టన్నెల్ ప్రమాద ప్రదేశాన్ని పరిశీలించి విశ్లేషిస్తున్నారు. సింగరేణి, ఆర్మీ, ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, ర్యాట్ హోల్ మైనర్స్, కాడవర్స్ డాగ్స్, హైడ్రా, అన్వి రోబోటిక్స్, దక్షిణ మధ్య రైల్వే, జీఎస్‌ఐ, జలవనరుల వంటి 12 బృందాలు ఒక్కటిగా పనిచేస్తున్నాయి.

సమన్వయంతో ముందుకు..

సహాయక బృందాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని డిజాస్టర్ మేనేజ్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్‌కుమార్ అన్నారు. మంగళవారం ఉదయం కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, సహాయక బృందాల ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. కేరళకు చెందిన కడావర్ డాగ్స్ టన్నెల్‌లోకి వెళ్లాయిన.. టీబీఎం ప్లాట్‌ఫామ్‌ను ప్లాస్మా కట్టర్‌తో తొలగించే పనులు వేగంగా కొనసాగుతున్నాయని, టీబీఎంపై ఉన్న మట్టిని సమాంతరంగా తొలగించే ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. సహాయక బృందాలు నిరంతరం శ్రమిస్తున్నాయని, కట్ చేసిన విడిభాగాలను ఎస్కలేటర్ ద్వారా తొలగించి లోకో ట్రెన్‌లో బయటకు పంపిస్తున్నామని, మట్టిని కన్వేయర్ బెల్టు ద్వారా తరలిస్తున్నట్లు వివరించారు.



సహాయక బృందాలతో సమీక్ష నిర్వహిస్తున్న అరవింద్‌కుమార్

ఆటంకంగా మారిన టీబీఎం శకలాలు..

నీటి ఊట, బురద మట్టి, టన్నెల్ బోరింగ్ మిషన్ (టీబీఎం) శకలాలు సహాయక చర్యలకు ప్రధాన అడ్డంకిగా మారాయి. డి–1, డి–2 ప్రదేశాల్లో కాడవర్ డాగ్స్ చూపిన ప్రదేశాల్లో తవ్వకాలు చేపడుతుండగా టీబీఎం శకలాలు అడ్డుగా వస్తున్నాయని, దీంతో పనులు ముందుకు సాగడం లేదని సహాయక బృందాలు చెబుతున్నాయి. దక్షిణ మధ్య రైల్వే బృందాలు ప్లాస్మా కట్టర్లతో టీబీఎం శకలాలను తొలగిస్తుండగా.. రెస్క్యూ బృందాలు తీసిన మట్టిని కన్వేయర్ బెల్టు ద్వారా బయటికి పంపడంలో ఆలస్యమవుతుంది. లోకో ట్రెన్ ద్వారా మట్టి, టీబీఎం శకలాలు బయటకు తరలిస్తున్నారు.

అత్యాధునిక సాంకేతిక పరికరాలు, డ్రిల్లింగ్ మిషన్లు, సెన్సార్లు, రోబోటిక్ పరికరాలు వంటి సాధనాలను వినియోగించి సహాయక చర్యలు వేగవంతం చేస్తున్నట్లు చెప్పారు.

బండరాయితో మోది వ్యక్తి దారుణ హత్య

- కావేరమ్మపేటలో ఘటన



హత్య ప్రదేశాన్ని పరిశీలిస్తున్న సీఐ కమలాకర్, తదితరులు

జడ్చర్ల: ఓ గుర్తు తెలియని వ్యక్తి (42)ని పెద్ద బండరాయితో మోది దారుణంగా హత్య చేసినట్లు సీఐ కమలాకర్ తెలిపారు. వివరాలు.. కావేరమ్మపేటలో ఓ గుర్తు తెలియని వ్యక్తి (42) మంగళవారం దారుణ హత్యకు గురయ్యాడు. సంత రోడ్డు నుంచి జాతీయ రహదారికి వెళ్లే ప్రధాన రోడ్డును అనుసరించి ఉన్న ఓ దుకాణం ముందు హత్య చేయబడిన వ్యక్తిని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని హత్య ప్రదేశాన్ని పరిశీలించారు. డాగ్‌స్క్వాడ్‌తో ఆధారాలకు సంబంధించి అన్వేషించారు. పరిసర ప్రాంతాల్లో గల సీసీ కెమెరాలను ఆరా తీశారు. హతుడి ఎడమ భుజం, చెంప, ఛాతిభాగంపై ఒక పెద్ద బండరాయి ఉన్నది. తలపై బండరాయితో మోది హత్యచేసి ఉంటారని భావిస్తున్నారు. హత్య అర్ధరాత్రి వేళ జరిగి ఉండొచ్చని భావిస్తున్నారు. మృతుడు తెలుపు, నీలం రంగులో గల హాఫ్ షర్ట్ ధరించి ఉన్నాడు. మెరున్ కలర్ ఫుల్ డ్రాయర్ ఉండగా నడుముకు నాలుగు వరుసల ఎర్రటి మొలతాడు. మెడలో రుద్రాక్ష ఉన్నది. అంతకు మించి మరెలాంటి ఆధారాలు లేవని సీఐ తెలిపారు. వ్యక్తిగత కక్షల కారణంగానే హత్య జరిగి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం జడ్చర్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కావేరమ్మపేట ప్రధాన రహదారిని అనుసరించి జనం తిరిగే రద్దీ ప్రాంతంలోనే హత్య జరగడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక కౌన్సిలర్ రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పాత కక్షలతో వేటకొడవలితో దాడి



గాయపడిన మల్లప్ప

కోస్గి రూరల్: పాత కక్షలతో సొంత పెద్దనాన్నపై వేట కొడవలితో దాడి చేసిన సంఘటన మండలంలోని పోతిరెడ్డిపల్లిలో చోటుచేసుకుంది.

పోలీసుల కథనం ప్రకారం.. పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన అన్నదమ్ములు ఈర్లపల్లి మల్లప్ప, రామయ్య మధ్య భూపంపకాలు జరిగాయి. అయితే రామయ్య కుమారుడు నర్సింహులు వరి చేనుకు నీరు పారించే విషయంలో తరుచుగా మల్లప్ప కుటుంబ సభ్యులతో గొడవపడేవాడు. దీంతో పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయతీ పెట్టి సర్ది చెప్పారు. అయితే నర్సింహులు సోమవారం పొలంలో పనులు చేసుకుంటున్న మల్లప్ప దగ్గరకు వెళ్లి మరోమారు గొడవ పడి తన వెంట తెచ్చుకున్న వేట కొడవలితో మల్లప్ప మెడ, రెండు చేతులపై దాడి చేశాడు. గమనించిన చుట్టుపక్కల పొలాల వారు కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా హుటాహుటిన కోస్గి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో పాలమూరుకు అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై మల్లప్ప కుమారుడు ఇసువయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ బాలరాజు తెలిపారు.

భర్తతో వివాహేతర సంబంధం పెట్టుకుందని..

అంతమొందించింది



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్‌ఐలు

నారాయణపేట రూరల్: తన భర్తతో మరో మహిళ వివాహేతర సంబంధం పెట్టుకుందని అనుమానంతో రాయితో మోది హత్య చేసింది. పోలీసులు తెలిపిన వివరాలు.. జలాల్‌పూర్ గ్రామానికి చెందిన బుజ్జమ్మ అలియాస్ వెంకటమ్మ(36)కు 15 ఏళ్ల క్రితం కర్ణాటక రాష్ట్రం నస్లెకి చెందిన రాజుతో వివాహమైంది. పెళ్లయిన రెండేళ్లకే భర్త నుంచి విడిపోయి తల్లి వారింట్లో ఉంటోంది. జీవనోపాధి కోసం పల్లె ప్రకృతి వనంలో మొక్కలకు నీళ్ల పోసే పనిచేస్తుండేది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన మొగులప్పతో పరిచయం ఏర్పడి వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తుంది. ఇరువురి ప్రవర్తనపై అనుమానం వచ్చిన మొగులప్ప భార్య లక్ష్మి గతంలో పలుమార్లు బుజ్జమ్మతో గొడవ పడింది. పెద్దల సమక్షంలో పంచాయతీ పెట్టి సర్దిచెప్పారు. అయినప్పటికీ వారి ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో ఇరువురి మధ్య ఎన్నోసార్లు గొడవలు, దాడులు జరిగాయి. ఈ క్రమంలో మంగళవారం నర్సరీలో పనిచేస్తున్న బుజ్జమ్మ దగ్గరకు లక్ష్మి ఆవేశంగా వెళ్లింది. ఇది గమనించిన బుజ్జమ్మ తనపై దాడి చేయడానికి వస్తుందని ఉపాధి హామీ మేటికి ఫోన్ ద్వారా సమాచారం అందించి, నర్సరీ గేటుకు తాళం వేసుకుంది. అయినప్పటికీ లక్ష్మి ముళ్లపొదలను దాటుకుంటూ లోపలికి వెళ్లి రాయితో బలంగా బుజ్జమ్మ తలపై మోదడంతో రక్తస్రావమై అక్కడికక్కడే మృతిచెందింది. విషయం తెలుసుకున్న సీఐ శివకుమార్, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు ఘటనా స్థలానికి చేరుకొని నిందితురాలిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై బుజ్జమ్మ సోదరుడు నందిపాటి రామచంద్రప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గ్రూప్స్‌లో సత్తాచాటిన బల్గెర వాసి



గట్టు: మండలంలోని బల్గెరకు చెందిన ఆంజనేయులు నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హత సాధించి సత్తా చాటాడు. సామాన్య రైతు కుటుంబానికి చెందిన తిమ్మప్ప, మల్లమ్మ దంపతులకు ముగ్గురు సంతానం కాగా.. పెద్ద కుమారుడు ఆంజనేయులు గ్రూప్–4లో ప్రతిభ కనబర్చి గద్వాల మున్సిపాలిటీలో జూనియర్ అకౌంటెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అలాగే ఇటీవల వెలువడిన గ్రూప్–2, 3, 4తో పాటు సోమవారం విడుదలైన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించారు. ఆంజనేయులు 1 నుంచి 7వ తరగతి వరకు బల్గెర పాఠశాల, 8 నుంచి 10వ తరగతి వరకు మాచర్ల జెడ్పీ ఉన్నత పాఠశాల, ఇంటర్, డిగ్రీ జిల్లాకేంద్రంలోని మహారాణి ఆదిలక్ష్మీదేవమ్మ కళాశాల, పీజీ పాలమూరు యూనివర్సిటీ, బీఎడ్ హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తి చేశారు. పోటీ పరీక్షలకు ఆరేళ్లుగా రోజు 8 నుంచి 10 గంటలు కష్టపడి చదివానని ఆంజనేయులు వివరించారు. 2024లో తల్లి చనిపోగా.. తండ్రితో పాటు ఇద్దరు తమ్ముళ్లు తనకు తోడుగా నిలిచినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో పాటు మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఫారెస్ట్ అధికారి సస్పెండ్

మహమ్మదాబాద్: అటవీ శాఖలో అక్రమాలకు పాల్పడుతూ కాసులు వెనకేస్తున్న ఓ ఫారెస్ట్ అధికారిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మహమ్మదాబాద్ ఫారెస్ట్ రేంజ్ అధికారి అబ్దుల్‌హాయ్ కథనం ప్రకారం.. మహమ్మదాబాద్ అటవీశాఖ రేంజ్ పరిధిలో కొండాపూర్ సెక్షన్ అధికారిగా నర్సింహులు పనిచేస్తున్నాడు. అటవీ పరిధిలో నర్సరీల్లో మొక్కలను పెంచుతూ అదే ప్రాంతంలోని పిచ్చిమొక్కలు ఉన్న స్థలంలో మొక్కలు నాటి పెంచాలి. ఆ ప్రాంతంలో ఉన్న నీలగిరి చెట్లను నర్సరీ పేరుచాటున నరికివేస్తూ ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకుంటూ అక్రమార్జనకు తెరలేపాడు. ఇదే తరుణంలో కొన్నిరోజులుగా కొందరు వ్యక్తులు ఆయనపై ఫిర్యాదు చేయడంతో ఉన్నతాధికారులు అక్రమంగా తరలిస్తున్న కలప లారీని పట్టుకుని కేసు నమోదు చేశారు. ఉన్నతాధికారులు విచారణ చేయగా సెక్షన్ అధికారి నర్సింహులు అక్రమాలకు పాల్పడుతున్నట్లు తేలడంతో మంగళవారం ఆయనను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు రేంజ్ అధికారి తెలిపారు.